

తిరుమల విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడియంలో నిర్వహించిన సెకండ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్-2022 పోటీల్లో తిరుమల విద్యాసంస్థల విద్యార్థి రాయుడు వీరేంద్రబాలాజీ అత్యుత్తమ ప్రతిభతో మొదటిస్థానంలో నిలిచారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారు పతకం విజేత వీరేంద్ర బాలాజీని ఛైర్మన్ తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి సతీష్ బాబు, ప్రిన్సిపల్ శ్రీహరి అభినందించారు



విద్యార్థిని అభినందిస్తున్న ఛైర్మన్ తిరుమలరావు

పౌల్ట్రీ కుదేలు

- పడిపోయిన చికెన్, గుడ్డు ధరలు
- కార్తీక మాసం, ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి ఎఫెక్ట్
- నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చికెన్ ధరలు నేలను తాకాయి. గుడ్డు ధరలూ అదే బాటలో పయనిస్తున్నాయి. ఈ ప్రభావం పౌల్ట్రీ రంగంపై తీవ్రంగా పడుతోంది. పౌల్ట్రీ రైతులు నష్టాల బాట పడుతున్నారు. విద్యుత్ సరఫరా, మేత వంటివి సబ్సిడీ ఇవ్వాలని కోస్తేక్షన్ పౌల్ట్రీ ఫారాల యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. కార్తీక మాసం కావడంతో గతంలో ఎన్నడు లేని విధంగా ధరలు పడిపోయాయి. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా ఏడాదిలో మూడు నెలలు పౌల్ట్రీ పరిశ్రమ ఆశాజనకంగా ఉంటుంది. మిగతా తొమ్మిది నెలల పాటు అటు ఇటుగా ఉంటుంది. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో చికెన్ అమ్మకాలు తగ్గాయి, దాణా ధర, విద్యుత్ ఛార్జీలు, కోడి పిల్ల ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. కోళ్ల పెంపకానికి అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయానికి సరిపోతుండటంతో శ్రమ వృథా అవుతుందని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉండగా, దాదాపు 1. 40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. కిలో కోడి పెంపకానికి, మార్కెట్ చేరుకోవడానికి రవాణా ఖర్చు కలిపి రూ.150 అవుతోంది. రిటైల్ ధర రూ.120గా ఉంది.



దీంతో ఆదాయం లేకపోగా నష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క పెరుగుతున్న దాణా రేటు, తగ్గిన చికెన్ వినియోగం, ధర లేమి పౌల్ట్రీ రంగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం అవుతుంది.

కేజీ బాయిలర్ రిటైల్ ధర రూ 120

కేజీ బాయిలర్ కోడి రైతు ధర రూ.87 కాగా రిటైల్ ధర రూ.120గా ఉంది. కోడిగుడ్డు ధర హోల్‌సేల్‌లో రూ 4.75 వద్ద నిలకడగా ఉంది. కనిసంగా బాయిలర్ కోడి కేజీ రూ.160, గుడ్డు ధర రూ .6 చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుందని పౌల్ట్రీ రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం సరాసరిన ఐదు కోట్ల కోళ్ల ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే సరాసరిన 1.40 కోట్ల కోళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. సుమారు 30 శాతం ఉత్పత్తి ఇక్కడి నుంచే జరుగుతోంది. ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి లభిస్తుంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసి లారీల్లో ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత డీజిల్ ధరలు, టోల్‌గేట్ ఛార్జీలు క్రమంగా పెరిగాయి. చికెన్, గుడ్డు ధరలు మాత్రం వీటిని సమాంతరంగా పెరగలేదు. ఉత్పత్తికంగా ఎగుమతి జరిగే బీహార్, బెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రోత్సాహం ఫలితంగా పౌల్ట్రీ ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై గోరుచుట్టుపై రోకలి పోటు లా మారింది.

నిర్వహణ ఖర్చు ఇలా

కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సో యా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18వేల నుంచి రూ.25వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80వేలకు పెరిగింది. దీంతో దాణా ఖర్చు రెట్టింపైంది. అదే స్థాయిలో కోడి ధర పెరగకపోవడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సాధారణంగా రెండు కిలోల కోడిగా ఎదిగేందుకు రెండు నెలల సమయం పడుతుంది. ఈ కాలంలో కోడి మూడున్నర కిలోల దాణా తింటుంది. కిలో దాణాకు రూ.60 వ్యయం అనుకుంటే, మూడున్నర కిలోలకు రూ.210 వరకు ఖర్చు వస్తుంది. కోడి పిల్ల ధర రూ.35. లేబర్ ఛార్జీ రూ.6,మెడిసిన్ ఖర్చు రూ.10, కరెంట్ బిల్లు రూ.1, వరిపొట్టుకు రూ.5,ఇతర ఖర్చులు రూ.3, ట్రేడర్ తరుగుదల కింద రూ.40, మొత్తంగా రెండు కిలోల కోడి పెంపకానికి రూ.300 ఖర్చు వస్తోం ది. కిలో కోడికి రూ.150 ఖర్చు వస్తుండగా, మార్కెట్‌లో రిటైల్ కోడి ధర రూ.120గా ఉంది.10వేల కోళ్లను పెంచితే కోడికి(2కిలోలు) రూ.300 చొప్పున రెండు నెలలకు సుమారు రూ.30లక్షల ఖర్చు. ఏడాదికి రూ.1.80కోట్లు నిర్వహణ వ్యయం అవుతోంది. కిలో కోడి ధర రూ.150 చొప్పున విక్రయించిన రైతుకు లాభం ఉండదు. అంతకంటే తగ్గిపోవడంతో కేజీకి రూ. 30 చొప్పున నష్టం వస్తుంది. ప్రభుత్వం నిర్దిష్ట రేటు రూ.160 నిర్ణయిస్తే కిలోకు రూ.10 లాభం వస్తుంది. అయితే మార్కెట్‌లో రేట్లు మార్పులతో రైతులకు నష్టమే మిగులుతోంది. కరోనాకు ముందు దాణా రేటు తక్కువగా ఉండటంతో ఖర్చు తగ్గి రైతులు లాభాలు పొందారు. అయితే కరోనా అనంతరం దాణా, ఇతర ఖర్చులు రెండింతలు పెరగడం, కోడి ధర మాత్రం అంతే ఉండటంతో పెట్టుబడికి తగ్గ ఆదాయం రాక నష్టపోతున్నారు.

విద్యుత్, దాణాపై సబ్సిడీ ఇవ్వాలి

పౌల్ట్రీ రైతుకోళ్ల పెంపకానికి అవసరమైన దాణా మొక్కజొన్న, జొన్నలు, బీర్, సోయా దాణాపై సబ్సిడీ ఇవ్వాలి. విద్యుత్ బిల్లులో రాయితీ ఇవ్వాలి. బ్యాంకుల నుంచి సబ్సిడీపై రుణాలు ఇస్తేనే తప్ప పౌల్ట్రీ మనుగడ కష్టం. రైతుల నుంచి లారీ యజమానులు కిలో కోడి రూ. 87 కు తీసుకెళ్తే, రూ.100 నుంచి రూ.110 వర కు కిలో చికెన్ విక్రయిస్తున్నారు. కిలో కోడికి 160, గుడ్డుకు రు 6 చొప్పున చెల్లిస్తేనే పౌల్ట్రీ పరిశ్రమ నిలబడుతుంది. లేకుంటే నష్టాలు తప్పవు.

- పడాల సుబ్బారెడ్డి, అధ్యక్షులు
అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సమన్వయ సంఘం

జనసేన, వైసిపి కార్యకర్తల మధ్య తోపులాట

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో సోమవారం జనసేన తలపెట్టిన జగనన్న ఇళ్లు-పేదలకు కన్నీళ్లు కార్యక్రమం జనసేన వైసిపి కార్యకర్తల మధ్య తోపులాటకు దారితీసింది. జనసేన పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల లబ్దిదారులు, కేటాయించిన ఇళ్లు తదితర వివరాలు తెలుసుకునేందుకు కందుల దుర్గేష్ నేతత్వంలో నాయకులు, కార్యకర్తలు సచివాలయానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైసిపి నాయకుడు ఆచంట కళ్యాణ్ ఇతర నాయకులు మధ్య మాటామాటా పెరిగింది. ఈ నేపథ్యంలో తోపులాటకు దారి తీసింది. పోలీసులు ఇరువురికీ సర్దిచెప్పి పంపించేశారు. ఘటనపై దుర్గేష్ స్పందిస్తూ సచివాలయంలో వైసిపి కార్యకర్తలకు పనేంటి అన్నారు. కావాల్సిన వివరాలు సచివాలయం సిబ్బందిని అడిగామని, వారు వివరాలు తెలియజేస్తున్నారని, ఆ సమయంలో వైసిపి వారి జోక్యం ఏమిటని ప్రశ్నించారు. వైసిపి నాయకుడు ఆచంట కళ్యాణ్‌రావు మాట్లాడుతూ పూర్వపరిచయంతో దుర్గేష్‌ను పలుకరించానని తెలిపారు. అయితే జనసేన కార్యకర్తలు సిఎంను దుర్భాషలాడటంతో ప్రశ్నించామని తెలిపారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు శిరీష ఎంపిక

కడియం : కడియం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పాయం శిరీష కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని పీడీలు పాల్ బాబు, డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా బాలికను హెచ్‌ఎం టి.సత్యనారాయణ, సర్పంచ్ మోసుగంటి సత్యవతి, ఎంఇఒ వి.లజపతిరాయ్, పలువురు ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయిని పుష్ప కుమారి రూ.1000 అందించారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాలబాబు విద్యార్థినిని, పీడీలను అభినందించారు.

శ్మశానానికి వంతెన నిర్మించాలని వినతి

గోకవరం : మండలంలోని కామరాజుపేట పేటలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన శ్మశానానికి వెళ్లేందుకు బురద కాలువపై వంతెన నిర్మించాలని పైడిమల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో డిటి దివ్యభారతికి, ఎంపిడిఒ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి సోమవారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ బురద కాలువ దాటుకుని మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో కాలువలో ఇసుక తీయడం వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ములపర్తి భూషణం, ఎం.ప్రసాద్, విష్ణుమూర్తి, పిల్లి బాలు, ఆర్.నారాయణరావు ఉన్నారు.

లెప్రసీ, నిమోనియా సర్వేపై అవగాహన

గోకవరం, నల్లజర్ల : లెప్రసీ, నిమోనియా సర్వేపై జిల్లాలో పలుచోట్ల వైద్య సిబ్బందికి అవగాహనా సదస్సులను సోమవారం నిర్వహించారు. గోకవరం మండలంలోని కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈనెల 15 నుంచి వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఇంటింటికి తిరిగి లెప్రసీకి సంబంధించిన సర్వే చేస్తారన్నారు. దీనికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు, సిహెచ్ఒ మేరీహెప్సీ, శైలజ, శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. నల్లజర్లలో సర్వే వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ తెలిపారు. సంపూర్ణంగా కుష్టుని నివారించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక సర్వేను చేపట్టిందన్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఈ నెల 15 నుంచి డిసెంబరు 5 వరకూ ఇంటింట సర్వే ప్రారంభమవుతుందన్నారు.

కరాటేలో కడియం విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి - కడియం

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో కడియం జపాన్ ఫోటోకాం కరాటే విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి, వివిధ విభాగాల్లో పతకాలు సాధించాని గ్రాండ్ మాస్టర్ కె.జానకిరాముడు తెలిపారు. మొదటి స్థానంలో ఎం.ధరణి, బి.ప్రియాసిని, వి.భాగ్యలక్ష్మి, పి.కీర్తి అపర్ణ, ద్వితీయ స్థానంలో బి.శాలిని, జి.సాయి సంహిత, ఆర్.రోహిత్, కే.సాయి హర్ష, కే.లోకేష్, కె.ఈశ్వర్, తతీయ స్థానంలో జె.పోసివేని, జి.పవన్ కుమార్, ఐ.నవీన్ కుమార్, డి.మోహన్ పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను గ్రాండ్ మాస్టర్ కె.నాగిరెడ్డి అభినందించారు.

అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో సోమవారం నిర్వహించిన ఈ మేళాకు 220 మంది హాజరయ్యారు. వీరిలో 158 మంది ఎంపికయ్యారని, సెలక్ట్ అయిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా దవీకరణ పత్రాలను రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డిఎన్‌వి.రాజు అందజేశారు. ఈ మేళాకు 15 కంపెనీలు హాజరయ్యాయి. ఐఎంసి ఛైర్మన్ డాక్టర్ ఎ.జయకృష్ణ, ఎపి పేపర్‌మిల్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ అధికారి గణేష్, ఇతర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని అప్రెంటీస్ మేళా కో-ఆర్డినేటర్ జివి.రమణరావు తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిపల్ తదితరులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కొవ్వూరు రూరల్ : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు 2వ జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ కె.శారదాంబ అన్నారు. సోమవారం స్థానిక అభ్యాస పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టం అందరినీ ఒకేలా చూస్తుందన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వెంకటేష్, వై.ప్రకాశరావు, వి.రాజావరప్రసాద్, ప్రిన్సిపల్ పి.రఘురాం పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

చాగల్లు : మండలం అభివృద్ధికి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సభ్యులు, అధికారులు సహకారం అందించాలని చాగల్లు ఎంపిపి ఎం.వీరస్వామి కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ బి.రాంప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మండంలో రోడ్లకు మరమ్మతు చేయాలని, గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను నేటికీ పరిష్కారం కాలేదని, వెంటనే వీటిని పరిష్కరించాలని పలువురు సమస్యలు సమావేశంలో ప్రస్తావించారు. మార్కొండపాడు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ విద్యుత్ షాక్‌తో మతి చెందిన జె.లలిత కుటుంబానికి మండల పరిషత్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది సేకరించిన రూ.1.50 లక్షల చెక్కును ఎంపిపి అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జె.రామచంద్రరావు, సభ్యులు, సర్పంచుల పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కడియం : మండలంలోని దుళ్ల ఎంపిపి నెంబర్-1 స్కూల్ విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తానా ఫౌండేషన్ ఇండియా (విజయవాడ) తరపున సునీత పుస్తకాలు, చార్ట్స్, బోధనోపకరణాలను సోమవారం పంపిణీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన కంటిపూడి కిరణ్ కుమార్ పుస్తకాలు , ఇతరత్రా వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వి.లజపతిరాయ్, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఎస్ఎంసి ఛైర్మన్ వెంకటరామబ్రహ్మం, కంటిపూడి సాయి, బాలకృష్ణ, హెచ్‌ఎం ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై హర్షం

పెరవలి : మండలంలోని అజ్జరం, వెంకటరాంపురంలో 4.50 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించినందుకు సర్పంచులు గారపాటి నాగసుధనాగభూషణం, పోలిశెట్టి బాలాజీ, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు గ్రామాల మధ్య ఉన్న 16 నెంబర్ జాతీయ రహదారి గోతులమయంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో రూ.2.50 కోట్లతో రోడ్డును నిర్మిచారని వారు తెలిపారు.

ఘనంగా మద్దిపాటి పుట్టినరోజు

గోపాలపురం : టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పుట్టిన రోజు వేడుకలు స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆయన నూతనంగా నియమితులయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గోపాలపురం : విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని గోపాలపురం సొసైటీ అధ్యక్షులు కూసం రామమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్‌పి ఉన్నత పాఠశాలలో కూసం గాంధీ రెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు రామ మోహన్‌రెడ్డి రూ.20 వేల విలువ చేసే క్రీడా దుస్తులను, ఈజీ ఇంగ్లీష్ బుక్స్‌ను హెచ్‌ఎం సోమశేఖర్ ఆధ్వర్యంలో అందజేశారు. తొలుత బాలల దినోత్సవ శుభాకాంక్షలను ఆయన తెలియజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారుస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వద్ధాప్యంలో తోడుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్, ఉపాధ్యాయులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వడ్లూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ఉషాదేవి, 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి కె.విజయకుమారి, ఎఎన్‌ఎం డి.రజనీకుమారి, సూపర్‌వైజర్లు జె.శ్రీనివాసరావు, కె.నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగనవాడీ కేంద్రాల్లో వసతుల కోసం వినతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లిలో గల అంగనవాడి కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది గ్రామ కార్యదర్శి కామేశ్వరికి సోమవారం ఒక వినతి పత్రం అందజేశారు. మౌలిక వసతులతో పాటు పౌష్టికాహారం క్వాంటిటీ పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం


జిల్లాలో బాలల దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. **గోపాలపురం** మండలంలో అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయరామారావు, ఉపాధ్యాయులు ఎస్.రాజశేఖర్, జి.వెంకటేశ్వరరావు, ఎ.జాన్‌బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం మలకపల్లిలో సిహెచ్.సర్జన్‌బాబు ఆధ్వర్యంలో నడుస్తున్న చిల్డ్రన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సోమవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హోం మంత్రి తానేటి వనిత హాజరయ్యారు. ఆమెకు విద్యార్థులు పూల బొకేలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం పలు పథకాలను అందిస్తుందన్నారు. జగనన్న మేనమామలా చిన్నారుల అవసరాలు తీరుస్తూ విద్యారంగంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం సర్జన్‌బాబు మాట్లాడారు. 45 ఏళ్లుగా తాము ఈ సంస్థను నడుపుతున్నామన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో మూడు మిషనరీ సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి ఛైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ఎఎంసి ఛైర్మన్ వల్లభశెట్టి శ్రీను, వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు దమయంతి, సర్జన్‌బాబు అభిమానులు, వైసిపి నాయకులు బుచ్చిరాయుడు, టి.రామకృష్ణ, ఇ.రామారావు, ఎం.భరమయ్య, బిసి నాయకులు చిట్టిబాబు ఆంధ్ర యూనివర్సిటీ మాజీ విసి జార్జ్ విక్టర్, సర్పంచులు పాల్గొన్నారు. అలాగే రాగోలపల్లి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. **సీతానగరం** చినకొండేపూడిలో అంగన్‌వాడీ చిన్నారులు, రాజుపాలెం పాఠశాల, ది సాల్వేషన్ ఆర్మీ ఐటిసి హెూమ్ ఆఫ్ సన్ షైన్ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు పుస్తకాలు, పెన్నులు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో పలివెల జ్యోతి,పలివెల నాగదేవి, ఎం.ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు. పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. **బిక్కవోలు** మండలం బలభద్రపురంలోని రవీంద్ర భారతి కాన్వెంట్లో చిల్డ్రన్స్ డేను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గుత్తుల రమణ మాట్లాడారు. సమాజ వికాసానికి విద్యార్థులే పట్టుగొమ్మలు అన్నారు. అనంతరం విద్యార్థుళకు పలుపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్ పట్నాయక్ డ్రాయింగ్ స్పెషల్ ఆర్టిస్ట్ శ్రావ్య, నేషనల్ రైఫిల్‌షూటర్ శ్రీసాయితేజస్విలను సత్కరించారు. **గోకవరం** మండలంలో రాజ పబ్లిక్ పాఠశాలలో స్కూల్ ఛైర్మన్ పట్నాల సూర్య ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ శివ నాగబాబు పాల్గొన్నారు.



తాళ్లపూడి మండలం ములకపల్లిలో సర్జన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న మంత్రి తానేటి వనిత తదితరులు

గోళీలు, డ్రై ఫ్రూట్స్‌తో నెహ్రూ చిత్రం

నిడదవోలు : నిడదవోలుకు చెందిన 5వ తరగతి విద్యార్థి కుంచాల తపస్వి రెడ్డి 'బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ చిత్రాన్ని గోళీలతో మళిచాడు. మొక్క జొన్న విత్తనాలు, బాదం గింజలును ఉపయోగించి కార్డుబోర్డుపై తయారు చేశారు. ఈ చిత్రపటం విశేషంగా ఆకట్టుకుంది.





కార్టూ'నిజం'

అదెలాగో కనుక్కోండి సార్..
మనమూ కిరికిరి చేయొచ్చు..!!

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. **పెరవలి** మండలం ముక్కామల శాఖ గ్రంథాలయంలో ఈ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చీర్ల పద్మశ్రీ ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాల్లో మౌలిక వసతులు పెంచుతామన్నారు. నూతన పుస్తకాలను తీసుకొస్తామని తలెఇపారు. శాఖ గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. గ్రంథాలయ అభివద్ధి కమిటీ ఛైర్మన్ కడియాల సాయిరామారావు పతాకావిష్కరణ చేశారు అనంతరం ఛైర్మన్ చీర్ల పద్మశ్రీని గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.త్రిమూర్తులు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, జడ్‌పిటిసి సభ్యులు కె.రామాంజని, వైఎస్ ఎంపిపి వి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు ముఖ్యఅతిథులుగా ఎంపిపి సుంకర శ్రీవల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అభివద్ధి కమిటీ ఛైర్మన్ మెహర్ బాబా, మాజీ ఎంపిటిసి పి.బుజ్జి, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్, నాయకులు వీరబాబు, బి.మునీశ్వరరావు, రాజేష్, వెంకటేష్, దేవి, వందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చాగల్లులో** సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత ఎంఇఒ కోడి నాగేశ్వరావు, గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు పాల్గొన్నారు. చంద్రవరం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, ఎంపిటిసి జి.వెంకటనరసింహమూర్తి ప్రారంభించారు. గ్రంథాలయాధికారి సుమన్ కుమార్, ఎఎంసి డైరెక్టర్ వెల్లే నాగేశ్వరరావు పాల్గొన్నారు. చాగల్లు శ్రీ రాజరాజేశ్వరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డైరెక్టర్ పల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. **కొవ్వూరు రూరల్** ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను మున్సిపల్ ఛైర్మన్ బావన రత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, కౌన్సిలర్ తోట లక్ష్మీప్రసన్న, హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. **తాళ్లపూడి** శాఖ గ్రంథాలయంలో వైసిపి బిసి నాయకులు నక్కా చిట్టిబాబు, గంథాలయ అభివద్ధి సభ్యులు గుండుబోగుల ఆదినారాయణ, రిటైర్డ్ ఇన్చార్జి ఎంఇఒ సిహెచ్.ఆంజనేయులు ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథ పాలకుడు నరేష్, పాఠకులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** శాఖా గ్రంథాలయంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. సర్పంచ్ మెండి వెంకట్రావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ముఖ్యఅతిథిగా డిఎన్ఆర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సినల్ డాక్టర్ జె.చంద్రప్రసాద్ పాల్గొన్నారు. **కడియం** శాఖా గ్రంథాలయంలో ఎంఇఒ లజపతిరాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గొందేసి పూర్ణచంద్రరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీదేవినిర్మల, కడియం హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు. **గోపాలపురం** శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ పైడి శిరీష సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్ఐ రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



గోకవరంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపిపి శ్రీవల్లి తదితరులు

కొనసాగుతున్న జగనన్న ఇళ్లు - పేదల కన్నీళ్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

జనసేన పార్టీ ఆధ్వర్యంలో 'జగనన్న ఇళ్లు-పేదల కన్నీళ్లు' కార్యక్రమం కొనసాగుతోంది. తాళ్లపూడిలో జెఎస్‌పి మండల అధ్యక్షులు గంటా శివరామకృష్ణ ఆధ్వర్యంలో సూరయ్యపేట దగ్గరలో వైఎస్ఆర్ నగర్ పేర పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వారు పరిశీలించారు. ఒక పక్క ఫ్యాక్టరీలు మరోపక్క గ్యాస్ పైపులైను ఉన్న చోట్ల ఇళ్ల స్థలాలను కేటాయించడాన్ని వారు తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సీతాలు, వై.వీరరాఘవులు, కె.విజయ్‌కుమార్ తాడిపూడి ఎంపిటిసి గంట సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలో జెఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడా గురుదత్త ప్రసాద్ ఆధ్వర్యంలో వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, చీపురుపల్లి, కూనవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ళ గ్రామాల లబ్ధిదారులకు ఇచ్చిన జగనన్న కాలనీ లేఅవుట్లను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.విజయ్‌శంకర్, కె.సత్యనారాయణ, టి.రమేష్‌బాబు, చిడిపి నాగేశ్వరరావు, శ్రీను, యు.ఇస్సాకు, కె.అరుణకుమారి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో కె.సావరం, పాలంగి, ఉండ్రాజవరం జగనన్న లేఔట్లను పరిశీలించారు. జెఎస్‌పి మండల అధ్యక్షులు వి.బాలాజీ మాట్లాడారు. జగనన్న లేఅవుట్లలో కనీస వసతులు లేవన్నారు. నిర్మాణ సామగ్రిని తరలించేందుకు రోడ్డు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, నార్ని నానాజీ, ఎంపిటిసి సభ్యులు కె.కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

కళాశాల స్థలం ఆక్రమణకు గురైతే సహించం

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేట డిగ్రీ కళాశాల స్థలం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆక్రమణకు గురైందని, విద్యార్థుల ప్రయోజనం నిమిత్తం దాన్ని అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా స్పష్టం చేశారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర నాయుడుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. కళాశాల నిర్మాణంతోపాటు క్రీడామైదానం తీర్చిదిద్దడానికి అనుగుణంగా 10 ఎకరాల భూమిని గత ప్రభుత్వం కేటాయించగా మిగిలిన భూమిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పది నుంచి 15 అడుగుల కళాశాల స్థలం ఆక్రమణకు గురయ్యిందన్నారు. ఆక్రమణ ఫలితంగా భవిష్యత్తులో విద్యార్థులు క్రీడా ప్రదేశాన్ని కోల్పోయే అవకాశం ఉందన్నారు. కమ్యూనిటీ హాలుకు సంబంధించిన వారు వెంటనే వెనక్కి తగ్గాలన్నారు.

రిక్షా కార్మికులకు బ్యాంకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-సామర్లకోట

రిక్షా కార్మికులకు ఉపాధి కోసం కొత్త రిక్షాలు కొనుక్కునేందుకు రుణాలు వ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రిక్షా కార్మిక సంఘం 10వ మహాసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ అనేకమంది కార్మికుల రిక్షాలు పాడయ్యాయని, కొత్త రిక్షాలు కొనుక్కోలేక అనేక మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. వయసు మళ్లిన రిక్షా కార్మికులకు పింఛన్లు అందించాలని కోరారు. రిక్షాసంఘం నూతన కమిటీ ఎన్నిక గౌరవాధ్యక్షులు చల్లా మహేష్, అధ్యక్షులు ముప్పిడి సత్తిబాబు, కార్యదర్శి కరక మాణిక్యం, ఉపాధ్యక్షులు బొబ్బాది సింహాద్రి, సహకార్యదర్శి మరడబుడి నాగరాజు, కమిటీ సభ్యులుగా చెప్పల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎంఎల్సి తోట త్రిమూర్తులు కాజులూరు మండలం పల్లిపాలెంలో సుమారు 35 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, ఆ భూమిని బ్యాంక్‌లో తనఖా పెట్టి సుమారు రూ.5 కోట్లు అప్పు తెచ్చారని జనసేన పార్టీ నాయకులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పార్టీ పిఎసి సభ్యుడు పంతం నానాజీ, పితాని బాలకృష్ణ, పార్టీ మండపేట ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ, అమలాపురం పార్టీ ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. అప్పటి రామచంద్రాపురం ఆర్‌డిఒ లేండ్ ప్రొసెసింగ్ అధికారి కలిసి సర్వే చేసి తోట కబ్జా చేసిన భూమి ప్రభుత్వానిదని నిర్ధారించారని తెలిపారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

గాంధీ సత్రం పాలకవర్గం నియామకం

కోటనందూరు : తుని గాంధీ సత్రం నూతన పాలకవర్గాన్ని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో కమిషనర్ హరి జవహర్ లాల్ నియమించారు. ఛైర్మన్‌గా అనిశెట్టి సూర్యచక్రధర్, సభ్యులుగా చెక్క ఈశ్వర్యమ్మ, బోడపాటి సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కోండ వెంకట్రావు, శ్రీను నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి తుని మునిసిపాలిటీ ఛైర్మన్ ఏలూరు సుధా రాణి పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జగనన్న కాలనీల పరిశీలన

యు.కొత్తపల్లి : పేద ప్రజలకు ఇళ్లు ఇస్తామన్న వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో చేసిన మోసాలను వెలికితీస్తామని జనసేన పార్టీ నాయకులు తెలగం శెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గోర్స, కొమరగిరి గ్రామంలో కడుతున్న ఇళ్ళను పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు 12, 13, 14 తేదీల్లో జగనన్న ఇళ్లు.. పేదల కన్నీళ్లు.. అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్యాయం జరిగిన లబ్ధిదారుల సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు. అంతేకాక సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వం ఇస్తున్న నగదు బేస్‌మెంట్‌కు కూడా సరిపోదని ఎలా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని తెలగంశెట్టి ప్రశ్నించారు. మరికొన్నిచోట్ల మధ్యలోనే జగనన్న ఇల్లు కట్టుకోలేక బోడి గోడలతో దర్శనం ఇస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, లబ్ధిదారులకు సబ్సిడీపై ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుక సరఫరా చేయాలని తద్వారా కొంతమంది లబ్ధిదారులకు కాలనీలు కొట్టుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జ శ్రీను, బండి ఏసుబాబు, గంగాధర్ రావు, చిన్న వీరబాబు, శంకర్, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

కాట్రేనికోన : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పోర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎల్ఎమాట్లాడుతూ సిఎం జగన్ మత్స్యకారుల సంక్షేమానికి పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయ రంగం తర్వాత రెండో స్థానంలో మత్స్య పరిశ్రమ ఉందన్నారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ జీవనం సాగించే గంగపుత్రులకు ప్రభుత్వం వేట విరామ సమయంలో రూ.10 వేలు అందిస్తోందన్నారు. చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ఈనెల 21న ప్రపంచ మత్స్యకారులు దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలో జరగనున్న సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలి రావాలన్నారు. ఆ రోజున ఓఎన్‌జిసి రెండో విడత నష్ట పరిహారం రూ.46వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, మత్స్యకార నాయకులు ఓలేటి సతీష్, మల్లాడి ఆదినారాయణ, బర్రె రాంబాబు, సంగాని చిన్ని, అప్పాజీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఐ.పోలవరం : జి.మూలపొలం గ్రామ పంచాయ పరిధిలో ఉన్న జెడ్‌పి ఉన్న పాఠశాలను విద్యా కమిటీ ఛైర్మన్ సంగాని దుర్గాప్రసాద్, వై సి పి నాయకుడు మందపాటి భైరవస్వామి సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్ధులతో కలిసి భోజనం చేశారు. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. టెన్త్ విద్యార్థులకు రెండు నెలల నుంచి పిఎస్ బోధించే ఉపాధ్యాయుడు అనారోగ్యరీత్యా సెలవులో ఉన్నారని, తమకు సిలబస్ చెప్పేవారు లేరని విద్యార్ధులు అంటున్నారు. హైస్కూల్‌కు అతి దగ్గరగా ఉన్న విద్యుత్ స్థబాన్ని తొలగించి దూరంగా వేయాలని వారు అన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారితో మాట్లాడుతానని వైసిపి నాయకుడు సర్పంచ్ భర్త భైరవస్వామి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్. శ్రీనివాసరావు, బి.రవి, శ్రీనివాసరావు, జయప్రకాష్ నారాయణ ఉన్నారు.

మధుమేహం నిర్ధారణకు మెడికల్ క్యాంపు

పెరవలి : అంతర్జాతీయ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా ముక్కామలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీవు ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధిని నిరంతరం పరీక్షించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరిగెల అరుణకుమారి, సెక్రటరీ సలాది ఉదయభాస్కరరావు, ట్రెజరర్ ఎ.బాలసుబ్రహ్మణ్యం, ఎంపిటిసి జి.రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు పాల్గొన్నారు

ఘనంగా వనసమారాధన

నిడదవోలు : కుల, మతాలకతీతంగా కార్తీక వన సమారాధన నిర్వహించుకోవడం ఆదర్శనీయమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మల్టిపర్పస్ కమ్యూనిటి భవన అభివద్ధి కమిటీ ఛైర్మన్ బయ్యే వెంకట్రావు అన్నారు. కమ్యూనిటి భవన ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్తీక వన సమారాధనలో ఎస్‌సి, బిసి, మైనార్టీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ సమసమాజ స్థాపన అంబేద్కర్ ఆశయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం కమిటీ సభ్యులను పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సమరాదనలో ఎన్.వెంకటేశ్వరరావు, ఇ.సత్యనారాయణ, నక్కా వెంకటేశ్వర్లు, ఎన్.జయరాజు, ఎమ్‌డి అస్లాం, కె.వసంతరాజు పాల్గొన్నారు.

శివ నామమరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

కడియం : కార్తీక సోమవారం నేపథ్యంలో మండలంలోని కడియం, వేమగిరి, జేగురుపాడు, వీరవరం, మురమండ, కడియపులంక శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుండే ఆలయాలకు యాత్రికులు పోటెత్తారు. ఈశ్వరునికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఇఒలు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 26వ డివిజన్ పురంవారివీధి ప్రాంతంలో సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న సాగర్, ట్రైనీకలెక్టర్ ప్రఖర్ జైన్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ 26వ డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీలతోపాటు దాదాపు అభివృద్ధి పనులన్నీ పూర్తిచేశామన్నారు. త్వరలోనే ఆ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం కూడా పూర్తిచేసి నాణ్యమైన మంచినీరును అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ పనితీరుపట్ల ప్రజల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమౌతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి ప్రసాద్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు సంగాని నందం, కామాడి సీత, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, కొప్పనాతి బాబి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పైడా కాలేజీలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో పటవలలోని పైడా గ్రూపు విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న 120 మంది విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పొలిటెక్నిక్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ కాకినాడ జిల్లా ప్రొఫెషనల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య ప్రకాష్ మాట్లాడారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రాణాలను కాపాడి రక్తాన్ని దానం చేసినందుకు విద్యార్థులను ఆయన అభినందించారు. పైడా గ్రూప్ సెక్రటరీ పైడా శ్రీరామ్ మాట్లాడుతూ పైడా సంస్థలు సామాజిక సేవలో ముందున్నాయని తెలిపారు. బాదం బాలకృష్ణ బ్లడ్ బ్యాంక్ అధినేత బాలకృష్ణ హాజరై యువతీ యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ వీరభద్రరావు, డిడి రవీంద్రారెడ్డి, లయన్స్ క్లబ్ కాకినాడ జిల్లా ప్రెసిడెంట్ బి.రవికుమార్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ దుర్గరాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ నాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కరప

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని మండలంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ కన్నబాబుని రైతులు కలిసి విన్నవించుకున్నారు. సోమవారం రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు వేములవాడలో శివారు సిరిగలపల్లంక వాసులు కలిశారు. గ్రామంలో జ్వరాలతో చాలామంది బాధపడుతున్నారని, జ్వరాలు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని, వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపైన స్పందించి ఆయన గ్రామంలో పర్యటించారు. అక్కడ నుంచి జిల్లా వైద్య శాఖాధికారికి ఫోన్ చేసి, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, వైద్య బృందాన్ని ఆ గ్రామానికి పంపించి, సర్వే నిర్వహించి, కారణాలు తెలుసుకోవాలని, ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని రైతులు కలిసి తొలకరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, నిబంధనలు సడలించి మద్దతుధరకు దాన్యం కొనుగోలు చేయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.మంగాదేవి భీమశంకర్, బండే తాతాజీ, అప్పనపల్లి పెద్ద, పెంకే సత్తిబాబు, గ్రామ కార్యదర్శి వీరభద్రరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీ సర్వే గణాంకాలు

ప్రజాశక్తి-కాజులూరు

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కాకినాడ ఆర్‌డిఒ బివి.రమణ అన్నారు. సోమవారం కాజులూరు తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే కు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ బివి.రమణ మాట్లాడుతూ మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు గాను 11 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో రీ సర్వేకు సంబంధించి భూముల కచ్చితత్వం, విలువ గణాంకాలు పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి రీ సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి జి.వరహాలయ్య, తహశీల్దారు సాయి సత్యనారాయణ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అప్పారావు, డిటి సుబ్బారావు, సర్వేయర్ రూపావతి, ఆర్ఐ వేగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

ఇద్దరికి కత్తిపోట్లు, జిజిహెచ్‌లో చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గండేపల్లి మండలంలోని ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్, ఫైనల్ ఇయర్ విద్యార్థులు గొడవ పడ్డారు. ఇది కాస్తా కత్తిపోట్లకు దారితీసింది. ఈ దాడిలో ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఘంటసాల సాయితేజ, ముమ్మిడి సాయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు కాకినాడ జిజిహెచ్ తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్తున్నారు. గాయపడిన విద్యార్థులను ఎస్ఎఫ్ఐ నాయకులు టి.రాజా, సూరిబాబు పరామర్శించారు. ఘర్షణకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



బడుగువానిలంకలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంక సచివాలయంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ సంచార వైద్య శిబిరంలో సోమవారం 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు దూలం సత్తిబాబు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ సంచార శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కటారి గంగరాజు, కటారి కుమార్, కార్యదర్శి యు.సుప్రియ, ఎఎన్ఎం రాజామణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శుక్లా తదితరులు

కుష్టు నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమలాపురం

జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంపై పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవాళ్లు ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి ఎండిటి మందులు వాడాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే బహుళ ఔషధ చికిత్సలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తారన్నారు. కార్యక్రమంలో. డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని సిహెచ్‌వి భరత్ లక్ష్మి, ప్రాంతీయాసుపత్రి సూపరిం టెండెంట్ శంకర్రావు, రెడ్ క్రాస్ కార్యదర్శి శర్మ, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల అభివద్ధి అధికారి ఐదం రాజు, పరిపాలన అధికారి వివిఎస్.ప్రసాద్ లు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ద్వారపూడి, ఇప్పనపాడు, కేశవరం, ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాల్లో ఎనిమిది వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉండగా వీటికి 17 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

'నాడు-నేడు' పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

గుత్తెనదీవి గ్రామ పంచాయతీ పరిధిలో నాడు-నేడు పనులకు సోమవారం ప్రజాప్రతినిధుల శంకుస్థాపన చేశారు. జెగ్గంపేట, రాఘవేంద్రపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు రూ.50 లక్షలతో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి వీర వెంకట సత్య సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోసొసైటీ అధ్యక్షులు కశిలింక నరసిహమూర్తి, ఎంపిటిసి సభ్యుడు జొన్నాడ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సందర్శన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వం కేటాయించిన భూములను సోమవారం జనసేన పార్టీ నాయకుల సందర్శించారు. ప్రభుత్వం లబ్ధిదారులుకు గృహాలు నిర్మించాలని వారు ప్లకార్డులు ప్రదర్శించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జగనన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా అల్లవరం మండలం డి.రావులపాలెం, దేవగుప్తం, ఎంట్రుకోన గ్రామాల్లో డిఎంఆర్.శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వం కేటాయించిన భూములు సందర్శించారు. శేఖర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్ళు నిర్మించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యంగా పరిగణించాలన్నారు. **ఉప్పలగుప్తం** జగనన్న లే అవుట్లల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఎన్ని నిధులు కేటాయించారు, స్థలాలు మెరక చేయడానికి కేటాయించిన నిధుల వివరాలు కోరుతూ జనసేన పార్టీ నాయకులు డిఎంఆర్.శేఖర్ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయాల్లో అర్జీ లు అందజేశారు.

భూ సర్వేపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కాజులూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర భూ సర్వేపై రైతులు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ బి.సుబ్బారావు అన్నారు. సోమవారం మండలంలోని శలపాక, దుగ్గుదుర్రు గ్రామాల్లో రైతులకు సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఈ సమగ్ర భూ సర్వే ద్వారా పరిష్కారం కాగలవని ఆయన అన్నారు. ప్రతి రైతూ తమ భూమికి సంబంధించి డాక్యుమెంట్లు ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా నంబర్ వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అందించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో తణుకువాడ శలపాక సర్పంచులు నరాల సుబ్బరాజు, పోతు గనిరాజు, గనికమ్మ, అజయ్ కుమార్, పెంకే శ్రీజ్యోతి, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని దాష్టీకం వార్త అవాస్తవం

ప్రజాశక్తి-కరప

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి హైస్కూల్లో విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం అంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తమని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించి కరప ఎంఇఒ కె.కృష్ణవేణి, పోలీసులు విచారణ చేపట్టారు. పిహెచ్‌సి వైద్యాధికారి విద్యార్థిని పరీక్షించి ఎటువంటి గాయాలూ లేవని నిర్ధారించారు.

జగనన్న ఇళ్ల పట్టాలపై వినతి

ప్రజాశక్తి- కరప

మండలంలో జగనన్న ఇల్లు పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు అందించిన వివరాలను అందించాలని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు, పి.దుర్గాప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.గంగాధర్ ఆధ్వర్యంలో సచివాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు ఎంతమందికి ఇంటి రుణాలు మంజూరు చేశారు, ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎంతమంది అర్హులకు పట్టాలిచ్చారో తెలియపరచాలని దరఖాస్తులో కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లెళ్ల ప్రసాద్, వై.పండు, రమేష్ పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారం అందించడమే లక్ష్యమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీనీ నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, నాగశాస్త్రులు, పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పిశెట్టి సురేష్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత తహశీల్దారు రేలంగి బాపిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పుట్టినరోజు అత్యంత ప్రధానమైన పండుగ అన్నారు. మానవ బంధాలను పటిష్టం చేసే పుట్టినరోజున వృద్ధులకు దుప్పట్లు సమకూర్చడం, భోజన వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, అడబాల సత్తిబాబు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం సీతానగరం మండలం ముగ్గళ్ళకు చెందిన కాటే రాముపై దాడి చేసిన ఘటనలో సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. డబ్బులు విషయంలో వివాదం జరిగి బొబ్బిల్లంక కు చెందిన సోడదాసి రమేష్ రాము తలపై కొట్టాడు. ఈ మేరకు రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుని మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

ఆటో ఢీకొని వద్దుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం నర్సిపూడి గుమ్మలేరు ఆర్అండ్‌బి రహదారిపై మోదుకూరు ఎస్‌సి పేట వద్ద అదే గ్రామానికి చెందిన వద్ధుడు ఆకుల మున్నియ్య(72) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లేందుకు రహదారి వెంబడి నడిచి వెళుతున్నాడు. ఇంతలో అటుగా వెళుతున్న ఆటో వద్దుని ఢీకొనడంతో డ్రైనేజీలో పడి మృతి చెందాడు. ఈ మేరకు మున్నియ్య కుమారుడు ఆకుల చౌదరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దీక్షా శిబిరంలో ప్రజా సంఘాల నాయకులు

దంగేటి రాంబాబును అరెస్టు చేయాలని డి మాండ్

ప్రజాశక్తి -అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్‌టి మహిళా ఉద్యోగిని రొడ్డ భవాని పై భవాని మృతికి కారకులైన దంగేటి రాంబాబు ను అరెస్టు చేయాలని భవాని న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 74వ రోజుకి చేరుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాగిత శ్రీనివాసరావు మాట్లాడుతూ రాంబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ గూడపాటి విజయకుమార్, మాల మహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు,ఎన్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -మండపేట

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు 2 వార్డులో జరుగుతున్న పలుఅభివృద్ధి పనులను సోమవారం 2 కౌన్సిలర్ చిట్టూరి సతీష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఆయన వెంట పురపాలక సంఘ డిఇ సత్యనారాయణ, ఎఇ సత్యనారాయణ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణంలో పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. వివరాలు ఇవి.. విద్యుత్ లైన్ నిర్మాణానికి కాంట్రాక్టర్ వెస్ట్ బెంగాల్ నుంచి 14 మంది కార్మికులను తీసుకొచ్చాడు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలో రామచంద్రపురం జగనన్న కాలనీల్లో వారు పనిచేస్తున్నారు. లాల్ ముండా(31) పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనపై సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి గ్రామ శివారు 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీను వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం అచ్చన్న పాలెం ఎస్‌సి కాలనీకి చెందిన బోడి గడ్ల యువరాజ్ బైకుపై ఎర్నగూడెం వైపు వెళ్తున్నాడు. అనంత పల్లి గ్రామ శివారులో బ్రిడ్జిపై ఆగి ఉన్న లారీను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో యువరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలో పలుచోట్ల సారా బట్టీలపై సోమవారం దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా సీజ్ చేసి,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కోమటికుంటలో400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. మైనం పోసిబాబును అదుపులోకి తీసుకున్నామని అన్నారు. జగన్నాథపురం చెరుకు తోటలో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి అద్దేపల్లి చిరంజీవిని అదులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.